నల్లగా
పుట్టినందుకు
నలుగురిలోనూ
అవమానాలపాలు
అవుతున్న
ఆమె జీవితం?

కంచుమర్తి
వెంకటేశ్వరరావు
కథ

# ఎవరు శత్రువు

ఆఫీసు నుండి రాగానే మంచంమీద వాలిపోయింది జయంతి. ఉదయం నుండి గుండెలో దాచుకున్న అవమానాన్ని, ఆ అవమానం తనలో రేపిన అలజడిని, ఆ అలజడి కలిగించిన దుఃఖాన్ని ఇంక కంట్రోలు చేసుకోలేకపోయింది. గుండెలో ఇముడ్చుకోలేకపోయింది. భోరుమని ఏడ్చింది. ఆమె కన్నీళ్ళు దిండును తడిపాయి.

ఎంతసేపు ఏడ్చిందో తెలియదు. అలసిన శరీరం ఆమె కళ్ళకు మగతను కలిగించింది. అలాగే నిద్రపట్టేసింది జయంతికి.

"జయా... రాగానే పడుకున్నావేమిటి?"

అమ్మ రెండు మూడుసార్లు కుదిపింతర్వాత కళ్ళు తెరచింది. ఏడ్చి ఏడ్చి ఉబ్బిన ముఖాన్ని చూసిన అమ్మ వసుంధర ఆశ్చర్యపోయింది. రవ్వంతసేపు తల్లి హృదయం తల్లడిల్లింది.

"ఏం జరిగిందమ్మా... అలా ఉన్నావు"

వసుంధర గదిలో లైటువేసి కాఫీ చేతికిచ్చింది.

జయంతి మంచంమీంచి లేచి మాట్లాడకుండా కాఫీ త్రాగి టవలు, చీర పట్టుకుని బాత్ రూంకెళ్లింది. జవాబు చెప్పని కూతురును అదోలా చూసింది వసుంధర.

స్నానం చేసి బట్టలు మార్చుకుని డ్రెస్సింగ్ టేబులు ముందు కూర్చుంది జయంతి. నిలువెత్తుటద్దంలో తన పతిరూపాన్ని చూసుకుని విరక్తిగా



నవ్వుకుంది.

ఉదయం జరిగిన అవమానం తల్లికి ఎలా చెప్పగలదు. చెప్పితే మామూలే కదాయని ఓ నిట్టూర్పు విడుస్తుందులే. అందుకే తను ఎటువంటి అవమానాలు, హేళనలు, సానుభూతి ప్రకటనలు ఎదుర్కొన్నా వాటిన్నీ తనలోనే దాచుకోవడం, బాధపడడం అలవాటు చేసుకుంది.

రెండ్రోజుల క్రితం జరిగిన అవమానం ఒకఎత్తు. ఈరోజు ఉదయం తను ఊహించని పరాభవం అంతకు రెట్టింపు దుఃఖాన్ని కలిగించింది. ఆ క్షణంలో తన గుండె ఎన్ని ముక్కలయిందో ఎవరూ ఊహించి ఉండరు... ఆ సమయంలో రమ్య అన్న మాటలకు తన తల ఎంత పాతాళానికి వంగిపోయిందో, తన కళ్ళు ఎంతసేపు వర్షించాయో, తన మనసు ఎంతటి క్షోభకు గురియైందో, ఒక్కరంటే ఒక్కరు 'అయ్యో' అని ఉంటే తనెంత ఫీలవుతున్నానో తెలిసేది.

సాటి స్త్రీయైయుండి రమ్య అలా ఎలా అనగలిగిందో జయంతి ఊహించలేకపోతుంది. జయంతి ఊహకు అందిన విషయం ఒక్కటే. తనను ఒక మెట్టు క్రిందకు త్రోసి ఆమె మరో మెట్టు ఎక్కేందుకు ప్రయత్నించింది. ఆమె విజయం సాధించింది. ఆ విజయసాధనలో ఆ క్షణంలో ఆమెలో పుట్టిన అహంకారం; గర్వం... జయంతిని చులకనగా అనేందుకు ధైర్యాన్నిచ్చాయి. తన ఎడ్యుకేషన్ క్వాలిఫికేషన్ల ముందు ఆమె వెలవెలబోయినా మరో అద్భుతమైన, మగాళ్ళను వెర్రివాడలను చేసే క్వాలిఫికేషను రమ్యకు ఉండడంతో ఆమె తనను క్రిందకు దించేయగలిగింది. మాట అనగలిగింది.

జయంతి బి.కాం ఫస్టు క్లాసులో పాసయింది. తెలుగు, ఇంగ్లీషు టైపు లోయరు, హైయరు, షార్టుహేండ్ లోయరు, వర్కులో సిన్సియారిటీ ఇవి జయంతిలో అందరూ మెచ్చుకోదగిన అర్హతలయితే, అన్నింటిలోనూ తక్కువగా ఉన్న రమ్యకు ఉన్నది సిసలైన క్వాలిఫికేషను...

అది అందం...

రమ్యలో ఉన్నది,

జయంతికి లేనిది... అదే...

అందం... అందం అనే పదం ఎంత అందంగా ఉన్నా అది మనుష్యుల మధ్య ఎంతటి విభేదాలను సృష్టిస్తుందో, దూరాన్ని పెంచగలదో జయంతికి తెలుసు. పాతిక సంవత్సరాల వయసు నేర్పిన జీవిత అనుభవం జయంతిది.

సృష్టిలో అనేక తేడాలు. మంచి, చెడు... చీకటి, వెలుగు... వీటి గుణగణాలను మనిషి సృష్టించి బేరీజు వేసుకుంటాడు. ఆ మనిషిని సృష్టించిన భగవంతుడే ఒక మనిషి మరో మనిషితో సమానం చేయక రకరకాలుగా తేడాలు చూపించాడు. ఒకడిని అష్టైశ్వర్యాలు చిందులాడే లోగిలిలో పుట్టించితే, మరొకడిని కడు దరిద్రుడి ఇంట కటికనేలపైన జన్మనిచ్చాడు. ఇచ్చిన ఆ జన్మలోకూడా రంగుల తేడాలు... ఒకరిని తన మేధాచాతుర్యాన్ని, ఓపికనంతా ధారపోసి అపురూపంగా తీర్చిదిద్దితే, మరొకరిని ఏదో నిర్లక్ష్య ధోరణితో, విసుగుతో పారేసినట్లుగా. అసహ్యంగా భూమిపైకి పంపించాడు. ఈ రంగుల తేడాలపై ఎన్ని ప్రళయాలు జరిగాయో!

ఓ సామాన్య గుమస్తాకు మొదట కూతురుగా జయంతి పుట్టింది. పుట్టగానే ఏడ్చిన జయంతిని చూసి కొందరు ఏడుపు ముఖం పెట్టేరు. నల్లపిల్ల అన్నారు, నలుపు

రాజం అన్నారు. ఎవరు ఎన్ని అంటేనేం తల్లికి అపురూపం. బిడ్డను చూసి మురిసిపోయింది.

జయంతి తర్వాత ఒక అబ్బాయి.

జయంతి బడికి వెళ్ళిన రెండోరోజున తన నలుపు గురించి తెలుసుకుంది... తెలుసుకునేలా చేసారు తోటి పిల్లలు.

నల్లపిల్ల వచ్చింది...

దీన్ని ముట్టుకుంటే రంగు అంటుకుంటుంది.

పిల్లల ఎగతాళికి, ఆ వెక్కిరింతలు విని ముసిముసిగా నవ్వే టీచర్లు... వీళ్ళ ధోరణికి అప్పుడప్పుడు ఏడ్చేది. చిన్ననాటి నుండే తనకు అందంలేదు అనే భావం బాధించడం మొదలుపెట్టింది.


నల్లపిల్ల... నల్లపిల్ల... అని అందరూ అంటుంటే ఏడుస్తూ అమ్మను కౌగలించుకునేది. అమ్మ లాలించేది...

''నీకు అందం లేకపోయినా తెలివితేటలున్నాయమ్మా... నువ్వు వాళ్ళకంటే బాగా చదవాలి... అన్నింటిలోనూ ఫస్టు మార్కులు రావాలి... నిన్ను చూసి ఈర్ష్యపడాలి''

అమ్మ మాటలు చిన్న జయంతి హృదయంలో పదిలంగా నిండిపోయాయి. అప్పటినుండి ఎవరు ఎలా అన్నా వాటిని లెక్కచేయక ధ్యాసంతా చదువుమీదే నిలిపింది. ప్రతీ క్లాసులో జయంతిదే ఫస్టు మార్కులు. అయితే ఏదో ఒక సందర్భంలో ఎవరో ఒకరు ''జయంతి అంత నల్లగా ఉందేమిటి'' అనేవారు. మనసును ఎంత రాయి చేసుకున్నా ఒక్కొక్కప్పుడు బేలగా ఏడ్చేది.

''అందంగా లేకపోవడం, నల్లగా ఉండడం నా తప్పా'' అనుకునేది జయంతి.

ఒక్కొక్క సంవత్సరం వస్తూ జయంతిని పెద్దదాన్ని చేసాయి. హైస్కూలు



నుండి కాలేజీ మెట్టు ఎక్కింది. రంగు రంగుల సీతాకోక చిలుకల్లా అమ్మాయిలు... వాళ్ల మధ్య తను... రోజుకొక గండంగా గడిచేది.

తల వంచుకునే వెళ్ళేది... అప్పుడు కూడా కొందరు తనను నల్లపిల్ల అని కామెంట్ చేయడం వినేది. లోకాన్ని పూర్తిగా చదివిన జయంతి ఆ లోకంతో సంబంధం లేకుండా తనకంటూ ఒక లోకాన్ని సృష్టించుకుంది. అదే చదువు. టైపు, షార్టుహాండు... ప్రతీ క్షణం బిజీగా ఉండాలని...

ఇంటర్మీడియట్ అయింతర్వాత ఏం చేయాలా అనే సమయంలో మరో మలుపు. స్నేహితురాలి పెళ్ళి చూపులకని ఎవరో వస్తే తోడుగా ఆరోజు అక్కడే వుంది. వచ్చిన మగవాళ్ళు స్నేహితురాలి అందాన్ని చూసి, రెండు మూడు ప్రశ్నలడిగి ఖాయం చేసుకున్నారు.

"జయంతీ .... ఇంతకుముందు రెండు సంబంధాలు వచ్చాయి. ఏదీ ఖాయం కాలేదనుకో... లక్ష్మీదేవిలా నువ్వు అడుగుపెట్టావు... మా అమ్మాయి పెళ్ళి ఖాయం అయింది" అని స్నేహితురాలి అమ్మ జయంతిని పొగిడేసింది.

"వసుంధరా... నలుపయితేనేం మీ జయంతిలో లక్ష్మీకళ ఉంది. ఏ ఇంట అడుగుపెడుతుందోగాని ఆ ఇల్లు సిరిసంపదలతో తులతూగుతుంది" అనేవాళ్ళు వసుంధరతో.

"ఏమండీ... అమ్మాయికి పెళ్ళి సంబంధాలు చూడండి"

అమ్మ ఒకసారి నాన్నతో అనడం వింది జయంతి. 'పెళ్ళి' ఆ ఊహకే జయంతి మనసు పురివిప్పిన మయూరియైంది. స్నేహితురాళ్ళ పెళ్ళి చూపులు చూసింది.

తలవంచుకుని అమ్మాయి...

ఓరగా చూసే అబ్బాయి...

వేసే ప్రశ్నలు...

సిగ్గుగా చెప్పే జవాబులు...

ఎంత గమ్మత్తుగా, ఎంత అందంగా ఉంటుందా సమయం. తనను చూడ్డానికి ఎవరైనా వస్తే...

ఒళ్ళు జలదరించింది.

నాన్న ఏ సమాధానం చెబుతాడోనని తలుపుచాటున నిలబడి చెవులు రిక్కించింది జయంతి.

అంతే...

జయంతి ఎంత ఆశపడిందో అంత నిరాశ మనసును కలచివేసింది. మొదటిసారిగా వెక్కివెక్కి ఏడ్చింది.

జయంతి పెళ్ళి చెయ్యాలంటే మాటలా. అమ్మాయి మరీ నలుపు... అని కొందరంటున్నారు. మరి కొందరు అమ్మాయి నల్లగా ఉంది కదా కట్నం ఎక్కువ ఇవ్వగలరా! అని అడుగుతున్నారు. యాభై, డెబ్భై వేలు ఎలా ఇవ్వగలం... అబ్బాయికి అమ్మాయి తెల్లగా, అందంగా ఉండాలంట. ఎవరో ఎందుకు... నీ కోడలు నల్లగా ఉంటే ఇష్టపడతావా అదీ నాన్న జవాబు.

తెల్లగా, అందంగా ఉంటేనే పెళ్ళవుతుందా?

నల్లగా వుంటే కట్నం ఎక్కువ

ఇవ్వాలా?

జయంతి మరింక పెళ్ళి విషయమై ఆలోచించలేకపోయింది.

"వసుంధరా... మీ అమ్మాయిని సాయంత్రం ఇంటికి పంపించు. మా అమ్మాయిని చూడ్డానికి వస్తున్నారు. తోడుగా ఉంటుంది" అని ఎవరైనా అడిగితే చాలు వసుంధర జయంతిని పంపించేది.

జయంతి మనసులో ఎలా ఉన్నా వెళ్ళేది.

"నువ్వు రావడం... పెళ్ళి ఖాయం కాకపోవడమా"

"నీ అడుగు శుభ సూచకం జయంతీ"

అని ఆకాశానికి ఎత్తేసేవారు. చిన్నగా నవ్వుకునేది. ఏ స్నేహితురాలి పెళ్ళి చూపులకయినా జయంతి ముందు ఉండేది అందరి పెళ్ళిళ్ళు చేస్తున్నావు మరి నీ గురించి ఏమిటి అని ఎవరైనా సరదాగా అంటే ఈ పుణ్యం వలన నాకు పెళ్ళవుతుందేమో... అనేది జయంతి.

రోజులు, నెలలు గడుస్తున్నాయి.

జయంతి బి.కాం. ఫస్టు క్లాసులో పాసయింది. అదే సంవత్సరం షార్టుహాండ్ లోయరు పూర్తిచేసింది. ఆమె క్వాలిఫికేషన్లకు వెంటనే జాబ్ వచ్చింది.

"నాన్నా... నాకు ఉద్యోగం వచ్చింది"

నాన్న సంతోషించాడు. ఎలాగూ పెళ్ళి చెయ్యలేడు. అందుకని అడ్డు చెప్పలేదు.

క్లర్క్ కమ్ టైపిస్టుగా చేరింది. బయట ప్రపంచం కంటే ఆఫీసు మరో ప్రపంచంలా వింతగా కనిపించింది జయంతికి. ముసలివాళ్ళు, కుర్రాళ్ళు, పడుచు అమ్మాయిలు, వయసు మీరిన స్త్రీలు... ఒక్కొక్కరిది ఒక్కొక్క మనస్తత్వం...

నలుగురాడవాళ్ళలో రమ్య ప్రత్యేక ఆకర్షణ...

తెల్లగా, నాజూగ్గా, పొడవుగా అందానికే ఓ రూపంలా ఉంటుంది. బట్టలు నలగనివ్వదు. పౌడరు ఆరనివ్వదు. అసలే ఎర్రటి పెదవులు. దానికితోడు లిప్‌స్టిక్. కుర్ర గుమస్తాలు ఏదో పని కల్పించుకుని రమ్యతో కబుర్లు చెబుతారు. ఆమె అందంగా నవ్వి ఎదుటి వాళ్ళను పిచ్చెక్కించేది. అయితే రమ్య డ్రాఫ్టింగ్‌లో, టైపులో, డిక్టేషన్ తీసుకోవడంలో ఎప్పుడూ తప్పులు చేసి మేనేజర్ చేత

## రచయిత



ఓ కథా రచయిత పత్రికాఫీసుకి వచ్చాడు.

"మీరు ప్రచురించిన నా కథపై పాఠకుల్నించి ఉత్తరాలేమైనా వచ్చాయండి" అడిగాడు రచయిత ఎడిటర్‌ని.

"ఆ... ఓ వంద వరకూ వచ్చాయండి" చెప్పాడు ఎడిటర్.

"ఇంకా రావాలే... నేను పోస్టు చేసినవే రెండొందల కార్డులు" అనేసి నాలుక్కరుచుకున్నాడు రచయిత.

—చుక్కల గోపీచందర్ (మహబూబ్‌నగర్)

చివాట్లు తినేది. మేనేజరు తిడుతున్నా తేలిగ్గా తీసుకునేది రమ్య...

రేపో, మాపో రిటైరయ్యే మేనేజరు జయంతి చురుకుదనాన్ని చూసి అన్ని పనులు జయంతికే చెప్పేవాడు.

"జయంతీ... నీ డ్రాఫ్టింగ్ చాలా బాగుందమ్మా... వెదుకుదామన్నా టైపులో ఒక్క పొరపాటు కూడా కనిపించడం లేదు. కీప్ ఇట్ అప్" అని ప్రశంసించేవాడు.

ఆ మాటలకు పొంగిపోయేది.

ఎంత పనయినా సరే విసుగు లేకుండా చేసేది.

పని చేయడంలో తృప్తి.

క్రమంగా జయంతి మేనేజరుకు స్టెనోగా మారింది. రమ్య ఈర్ష్యగా చూసేది జయంతిని...

సంవత్సరాలు గడుస్తున్నాయి. నాన్న పెళ్ళి సంబంధాలు చూసి చూసి అలిసిపోయాడు. పాతిక సంవత్సరాల పరువాలతో, కోరికలతో, ఆశలతో జయంతి అప్పుడప్పుడు ఆలోచించేది తన జీవితానికి సార్థకత ఎప్పుడు?

ఒకరోజు జయంతి కొలీగ్ రామారావు ఇంటికి అందరితో పాటు వెళ్ళింది బర్త్‌డే ఫంక్షనుందని. రామారావు నల్లగా, చిన్న సైజు ఏనుగులా ఉంటాడు.

జయంతి అతని భార్య రాగిణిని చూసి ఆశ్చర్యపోయింది. ఎంత అందంగా ఉంది అని అనుకోకుండా ఉండలేకపోయింది. ఆ సమయంలో మరో ఆలోచన కూడా కలిగింది జయంతికి. అంత అందమైన ఆమెకు రామారావు భర్తా...

రామారావు భార్యకు జయంతిని పరిచయంచేసాడు. రాగిణిని ఎప్పటి నుండో పరిచయమున్న దానిలా పలుకరించింది. ఆమెపట్ల ఒకవిధమైన గౌరవభావం ఏర్పడింది జయంతికి. ఆరోజు నుండి నాల్రోజులకొకసారి రాగిణి దగ్గరకు వెళ్ళి మాట్లాడేది.

జయంతి గురించి అంతా తెలుసుకున్న రాగిణి ఓరోజు "జయంతి గారూ... ఈ సమాజాన్ని బాగు చేయాలంటే ఓ యుగకర్త పుట్టాలి. స్త్రీకి అందంకావాలి... చదువు కావాలి... అన్ని పనులూ వచ్చి వుండాలి. ఇవి ప్రతీ మగాడు కోరుకుంటాడు. అటువంటి లక్షణాలున్న అమ్మాయినే పెళ్ళి చేసుకుంటాడు. మరి అమ్మాయి కూడా తనకు కాబోయే భర్త అందంగా ఉండాలనుకోవడం తప్పా! కానీ ఈ విషయంలో అన్ని హక్కులూ మగవాడికే ఇచ్చింది సంఘం. మగవాడు అందంగా లేకపోయినా ఫరవాలేదు. డబ్బు సంపాదిస్తే చాలు... భర్త అందంగా లేకపోయినా భరించగలదు. జీవితాంతం రాజీపడగలదు... కానీ మగవాడు ముందే కావలసిందానిని కోరుకుంటాడు... ఈ తేడా పోయినప్పుడే మనం సుఖంగా జీవించగలం. మనసు అందం చూడడం చేతకానివాడు బాహ్య సౌందర్యాన్ని చూసి మురిసిపోతాడు" అంది.

జయంతి విరక్తిగా నవ్వుకుంది.

అదే నెలలో మేనేజరు రిటైరయ్యారు...

కొత్త మేనేజరు వస్తారు.

రెండ్రోజులు జ్వరంతో ఆఫీసుకెళ్ళలేదు...

మూడోరోజు ఆఫీసుకెళ్ళిన జయంతికి హెడ్ క్లర్క్ చెప్పాడు.

"నీ వర్క్ అంతా పెండింగ్ అయిందమ్మా... కొత్త మేనేజరు వచ్చేసరికి నీవు లీవులో ఉన్నావు. లోపలకు వెళ్ళి పరిచయం చేసుకుని డిక్టేషను తీసుకో"

జయంతి మేనేజరు రూంలోకి అడుగుపెట్టింది.

మేనేజరును చూసి ఆశ్చర్యపోయింది.

ముప్ఫయి ఐదేళ్ళు కూడా ఉండవేమో అతనికి. తెల్లగా సినిమా హీరోలా ఉన్నాడు.

గుడ్ మార్నింగ్ సార్ అని విష్ చేసింది.

అతను తలెత్తి చూసి ముఖం చిట్లించాడు. అతను చూసిన చూపుకు ఏడుపు వచ్చినంత పనయింది జయంతికి.

"మీరేనా జయంతి గారంటే"

అని గబగబ డిక్టేట్ చేసి హెడ్ క్లర్క్ కోసం బజర్ నొక్కాడు... అతను లోపలకు వచ్చాడు...

మీరిక వెళ్లవచ్చు అని జయంతికి సైగచేసాడు.

జయంతి స్ప్రింగ్ డోరు తెరచుకుని బయటకు వెళ్లి అంతలో తన పేరు మేనేజరు నోట్లోంచి వినబడడంతో విందామని గుమ్మం దగ్గరే ఆగిపోయింది.

"స్టెనోగా ఇంకెవరూ దొరకలేదా మీకు. అసలు స్టెనో ఎంత ఠీవిగా ఉండాలో తెలుసా! ఈవిడ గారి ముఖం చూస్తుంటే ఏం డిక్టేట్ చెయ్యాలో గుర్తుకు రావడంలేదు."

"సార్... జయంతి వెరీ సిన్సియర్ వర్కర్..."

"కావొచ్చు... నాకు స్టెనోగా ఉండాలంటే మరికొన్ని అర్హతలు కూడా ఉండాలి..."

జయంతికి కన్నీళ్ళాగలేదు.

ఆ క్షణంలో భూమి బ్రద్దలై తను దిగబడిపోతే బాగుండుననిపించింది. సీట్లోకి ఎలా వెళ్ళిందో తెలియదు... చాలాసేపటివరకు తేరుకోలేకపోయింది.



## చదువు సంధ్య

చాలా విషయాల్లో ఇతర దేశాలకంటే మన దేశం ఎంతో వెనుకబడి వుందనేది అందరికీ తెలిసిన విషయం. అందులో పుస్తకాలు చదవడం ఒకటి. బ్రిటన్‌లో ప్రతి వందమంది 850 పుస్తకాలు చదువుతున్నారట. అమెరికాలో 422 పుస్తకాలు చదువుతున్నారు. ఇక మనదేశం సంగతికొస్తే ప్రతి వందమంది కలిసి ఒకటిన్నర పుస్తకం మాత్రమే చదువుతున్నారట. దీనికి ప్రధాన కారణం నిరక్షరాస్యత. అదే మిగతా విషయాల్లోకూడా మనని వెనుకబడేట్లు చేస్తోంది.

బయటకు వచ్చిన హెడ్ క్లర్క్‌కు ముఖం చూపించలేకపోయింది.

ప్యూనుద్వారా విషయం తెలుసుకున్న అందరూ వింతగా చూసారు జయంతిని...

రెండ్రోజుల తర్వాత...

హెడ్ క్లర్క్ జయంతి దగ్గరకు వచ్చి, "సారీ జయంతీ... నీ ప్లేస్‌లో రమ్యను పంపించమని ఆర్డరు వేసారు మేనేజరుగారు. నువ్వు రమ్య సెక్షనులో వర్క్ చేయి" అన్నాడు...

జయంతి మాట్లాడలేదు.

తను పని గురించి బాధపడడంలేదు...

తను అందంగా లేననే కదా అతనలా మాట్లాడేదు...

పనికి, అందానికి సంబంధం ఏమిటి?

ఎంత అవమానం...

అలా అవమానించడానికి అతనికి మనసెలా ఒప్పింది. కేంటీన్‌లో కాఫీ త్రాగుతున్న జయంతి ప్రక్కన కూర్చుని రమ్య మరొక క్లర్క్‌తో, "ముసలి మేనేజరు నేను నీటుగా ఉండడంచూసి ఓర్వలేకపోయాడు. వాడికి తగ్గట్టే నల్ల ముసలమ్మ సరిపోయింది. ఇప్పుడు చూడండి... నా వర్క్ ముందు ఆవిడగారి సిన్సియారిటీ వెలవెలబోయేలా చేస్తాను. మనిషై పుట్టినందుకు నలుగురిలో తలెత్తుకు తిరిగేలా ఉండాలి. అసలు ఆడదాన్నై యుండి నేనే భయపడతాను ఆ ముఖాన్ని చూసి... మేనేజరు గారు ఎలా చూడగలరు... పని ఎలా చెప్పగలరు?" రమ్య మాటలు జయంతి గుండెను తాకాయి.

సాయంత్రం ఐదు గంటల వరకు సీట్లో ఎలా కూర్చుందో తెలియదు... తనివితీరా ఏడ్వాలనిపించింది. కానీ... అది ఆఫీసు.

అంతే... ఇంటికి వచ్చి మంచంమీద వాలిపోయింది.

ఆలోచనల నుండి తేరుకుని ఫోంచేసి గదిలోకి వచ్చిందే గానీ నిద్రపట్టడంలేదు.

అందం లేకపోవడం శాపమా!

అందరూ తనను ఎందుకు చిత్రవధ చేస్తున్నారు!

నా మనసు తెలుసుకుని ఆదరించి జీవితాన్ని సుఖమయం చేయగల వ్యక్తి, మహానుభావుడు ఎక్కడ ఉన్నాడు? ఎప్పుడు, ఎలా వస్తాడు.

ఆదివారం ఉదయం రాజ్యలక్ష్మి పెళ్ళి చూపులు. రాజ్యలక్ష్మి ప్రక్కింటి లాయర్‌గారి కూతురు. అలవాటు ప్రకారం వాళ్ళు పిలవగానే జయంతి వెళ్లింది. కార్యక్రమం అంతా అయింతర్వాత ఇంటికి బయలుదేరిన జయంతి హాండ్‌బ్యాగ్ మరిచిపోయింది. అది తీసుకునేందుకు వెనక్కు వెళ్ళింది.

తలుపు దగ్గరే ఆగిపోయింది.

లోపల మాటల్లో తన ప్రస్తావన వినబడడంతో...

"ఏ అమ్మాయి పెళ్ళి చూపులైనా ఈ నల్లదాన్ని పిలుస్తారెందుకు" అని ఒకామె అడుగుతుంది.

"అడుగుపెడితే శుభం జరుగుతుందట" మరొకామె.

"శుభమా! పాడా! మన అమ్మాయి అబ్బాయికి నచ్చాలంటే అందమైన స్నేహితురాళ్ళను పిలువకూడదు. మన

పిల్లకంటే ఆ అమ్మాయి బాగుందంటే అబ్బాయి ఆ పిల్లనే మాస్తాడు... మన పిల్ల నచ్చలేదని చెప్పేస్తాడు. అదే జయంతి మన అమ్మాయి ప్రక్కన ఉందనుకో... జయంతిని చూసి మన అమ్మాయే బాగుందని మరేం ఆలోచించకుండా మనకు మాట ఇచ్చేస్తాడు. అందరూ జయంతిని తీసుకెళ్ళడంలో అంతరార్థం ఇదే... పెళ్ళి చూపుల్లో మనలాంటి పిల్లల తల్లులు వేసే నాటకంలో ఇదొక టెక్నిక్... అంతే''

అని నవ్వుతుంది లాయర్ భార్య.

జయంతి శిలా ప్రతిమయింది.

*

